ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
ఆదివారం 29 డిసెంబరు 2024



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి

కన్నుల పండువగా కల్యాణోత్సవం

ధర్మవరం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని తేరుబజార్‌లోని వాసవీ కల్యాణమండపం(కొత్తసత్రం)లో శనివారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కన్నులపండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను వేదపండితులు ప్రత్యేకంగా వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు పట్టణం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కులపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ ఎ. రత్న పేర్కొన్నారు. పట్టణంలోని నిజాంవలీకాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భంగం కలిగించినవారు ఎవరైనా సరే శిక్షార్హులవుతారన్నారు. కులవివక్ష, అంటరానితనం, వృద్ధులు, మైనార్టీ, దళిత, వెనుకబడిన, సమాన ఉపాధి హామీ తదితర హక్కుల గురించి వివరించారు. కులమతాలకు అతీతంగా అందరు కలిసి ఉండాలని సూచించారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాం గం హక్కులు కల్పించిందన్నారు. వీటిని అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాంప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం.. మహదానందం..!

- ఇంటర్ విద్యార్థుల హర్షం
- హాజరుశాతం పెరిగే అవకాశం



తరగతి గదిలో ఉన్న ఇంటర్ విద్యార్థినులు

ధర్మవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఆకలి బాధలను తీర్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కొన్నిప్రాంతాలలో విద్యార్థులు సమీపాన ఉన్న కళాశాలకు చేరుకోవాలంటే ఉదయం 7, 8 గంటలకే ఇంటి నుంచి బయలుదేరాలి. ఆ సమయానికి ఇంటి వద్ద భోజనం వండాలంటే ఇబ్బందే. అటువంటి సమయంలో రోజంతా పస్తు ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. తిరిగి ఇంటికి చేరుకునేసరికి సాయంత్రం ఆరు గంటలు దాటుతుంది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పాఠశాలల మాదిరిగానే కళాశాలల్లో కూడా భోజనం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు కళాశాలల్లో మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ జిల్లా అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

శ్రీసత్యసాయిజిల్లాలో 22 ప్రభుత్వ కళాశాలలు ఉండగా ఇందులో వృత్తి విద్య, సాధారణ కోర్సుల్లో దాదాపు 6400 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతానికి చెందిన వారే. కళాశాల దూరం కావడంతో వీరంతా ఉదయాన్నే ఇళ్లనుంచి బయలుదేరుతారు. మధ్యాహ్న భోజన పథకం అమలైతే వీరందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో పోషకాహారం..

ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించడంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. పాఠశాలల్లో వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు వేరుశనగ చిక్కీలు, మూడు రోజులు రాగిజావ, రోజుకొక ప్రత్యేకతతో మధ్యాహ్న భోజనం అందుతోంది. ఈ పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు అమలు చేస్తే వీరంతా కళాశాలలకు చక్కగా హాజరయ్యే అవకాశం ఉంటుంది. పోషకాహారంతో రక్తహీనత సమస్యలకు ఫుల్‌స్టాప్ పడనుంది. ఏకాగ్రతతో విద్యార్థులు చదువుకుంటారు.

ఉన్నత పాఠశాలల్లోనే వంట

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సమీపంలోని జడ్పీ ఉన్నతపాఠశాలల్లోనే వండనున్నారు. ఉన్నత పాఠశాలల భోజనం పథకం నిర్వాహకులే ఇంటర్ విద్యార్థులకూ వండుతారు. ఒకే కాంపౌండ్‌లో జడ్పీ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల ఉంటే విద్యార్థులు నేరుగా అక్కడికే వెళ్లి తినాలి. దూరంలో ఉంటే ఆహార పదార్థాలను జడ్పీ ఉన్నతపాఠశాల నుంచి జూనియర్ కళాశాలకు తరలిస్తారు. ఇందుకయ్యే ఖర్చును కళాశాల నిర్వహణ నిధులనుంచి వెచ్చించనున్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తే మేలు



కూటమి ప్రభుత్వం వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కళాశాల వేళల్లో మార్పులు చేసింది. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. - సాయిలీల, విద్యార్థిని

అర్ధాకలితో అలమటిస్తున్నాం



నేను రోజూ ఇంటినుంచి ఉదయం 7గంటలకు బయలుదేరి 8గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్నా. అప్పటికీ ఇంట్లో భోజనం తయారు కాదు. మధ్యాహ్న భోజనం పెడితే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

- దీపిక, విద్యార్థిని, కనంపల్లి

గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలుకు చర్యలు చేపడుతున్నాం. దీంతో డ్రాపౌట్లు తగ్గుతాయి. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంచాలని ఆదేశాలు వచ్చాయి.

- లక్ష్మీకాంతరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల



గొల్లపల్లి వంకలో వికసించిన తామరపువ్వులు


చూడండి... తామర వంక

ధర్మవరం రూరల్ మండలంలోని గొల్లపల్లి వంకలో తామరపువ్వులు వికసించాయి. ఉదయ వేళలో విరిసిన పువ్వులను చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. వంకలో అక్కడక్కడ తామరపువ్వులు వికసించాయి. దేవుళ్లకు ప్రీతిపాత్రమైన ఈ పువ్వులను పలువురు స్థానికులు తూళ్లతో కోసి పట్టణంలోని ఆలయాలకు ఇస్తున్నారు. - ధర్మవరంరూరల్

పరీక్షా పే చర్చకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రతి ఏటా నిర్వహించే పరీక్షా పే చర్చ 8వ ఎడిషన్ జనవరిలో ఢిల్లీలో నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన బోయే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఎంపిక కోసం జనవరి 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి 12వతరగతి చదివే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పాల్గొనాలనుకునేవారు హెచ్‌టీటీపీఎస్://ఐఎన్ఎన్ఓవీఏటీఈఐఎన్‌డీఐఏ1.మైజీఓవీ.ఇన్/అండ్ ఫోన్‌నెంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయ్యి అందులో ఇవ్వబడిన సమాచారాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అక్కడ ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయడమే కాకుండా పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రిని అడగాల్సిన ప్రశ్నలను 500 అక్షరాలకు మించకుండా తయారు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలన్నారు.

ప్రగతి పరుగులు
పారిశ్రామిక రంగానికి పూర్వవైభవం
ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
వైసీపీ పాలనలో హడావుడి తప్ప కానరాని అభివృద్ధి
2024 వెలుగులు
6



ఉమ్మడి జిల్లా పారిశ్రామిక ప్రగతిలో మణిపూస కియ. ఈ అంతర్జాతీయ కార్ల ఫ్యాక్టరీ గత టీడీపీ పాలనా కాలంలో జిల్లాలో స్థాపించబడింది. దీని ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కియతో స్ఫూర్తి పొంది, ఇతర పరిశ్రమల పెట్టుబడులు వస్తున్న తరుణంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్- 2023 ద్వారా జిల్లాకు పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వస్తాయని, ఆమేరకు వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదిరాయని నాటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి, శిలాఫలాలు వేసి హామీల గారడీ చేశారు. అయితే కొత్తగా ఒక్క ఫ్యాక్టరీ కూడా జిల్లా వైపు చూడలేదు. ఇలా ఈఏడాది మొదటి ఐదురు నెలల్లో పారిశ్రామిక రంగం నేలచూపులు చూసింది. టీడీపీ హయాంలోనే పాలసముద్రం వద్ద 503 ఎకరాల్లో ఏర్పాటు చేసిన నాసిన్ సంస్థను ప్రధాని మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలు జనవరి 16న ప్రారంభించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ సముదాయం (భెల్) నత్తనడకన సాగింది. ఇలా వైసీపీ పాలనలో పారిశ్రామిక ప్రగతి జిల్లాలో కుంటుపడింది. అయితే కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతిపై ఆశలు చిగురించాయి. గడచిన ఆరున్నర నెలల్లో జిల్లాలో పారిశ్రామిక పురోగతికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈక్రమంలో పారిశ్రామికవేత్తలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి/ అనంతపురం అర్బన్

ప్రగతి పరుగులు

జిల్లా పారిశ్రామికరంగానికి పూర్వ వైభవం



నాసిన్‌ను ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తదితరులు (ఫైల్)

- ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- జిల్లాకు టెస్లాను ఆహ్వానించిన మంత్రి లోకేశ్
- కూటమి ప్రభుత్వం రాకతో పారిశ్రామికవేత్తల్లో ఉత్సాహం
- అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు ఆలోచన
- వైసీపీ పాలనలో హడావుడి తప్ప కానరాని అభివృద్ధి
- 2024లో పారిశ్రామిక వెలుగు నీడల రౌండప్

4.0 పాలసీతో పారిశ్రామిక వెలుగులు

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 4.0 తీసుకువచ్చింది. జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం, విస్తీరణతోపాటు జాతీయ రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి బాటలు పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించారు. విద్యుత్ వాహనాల (ఈవీలు) బ్యాటరీలను తయారు చేసే పరిశ్రమ పెట్టాలని దిగ్గజ సంస్థ టెస్లాను ఉమ్మడి జిల్లాకు ఆహ్వానించారు. 2014-19లో టీడీపీ హయంలోనే కియ, బెల్, నాసిన్ ఏర్పాటుతో శ్రీసత్యసాయి జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా, పారిశ్రామిక కారిడార్‌గా అవతరించింది. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం జిల్లా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసింది. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు రహదారులు అభివృద్ధి, అనుసంధానం, ఎయిర్ కనెక్టివిటీకి శరవేగంగా అడుగులేస్తోంది. కియ సంస్థకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమల ఏర్పాటుతోపాటు జిల్లాలోను ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించారు. జిల్లాలో చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక కస్టర్ ఏర్పాటు, పారిశ్రామిక జిల్లా సమీక్ష సమావేశాలు, ఔత్సాహికుల ఆకర్షణతోపాటు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఈ ఆరునెలల్లో రూ. 1239 కోట్ల పెట్టుబడులతో 4049 మందికి ఉపాధి కల్పన దిశగా 32 పరిశ్రమలకు 1056 ఎకరాల భూముల కేటాయింపులు చేశారు.



మడకశిరలో కేఎస్ఎస్ఎల్‌కు భూములు కేటాయింపు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటిన మడకశిర ప్రాంత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు సామగ్రి తయారు చేసే పరిశ్రమ అయిన భారత్ ఫోర్జ్‌కు అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్)కు భూములు కేటాయించారు. ఈ సంస్థ మొదటి దశలో రూ.1430 కోట్లుతో పెట్టుబడి పెట్టనుంది. మొదటి దశలో 565 మందికి ఉపాధి లభించనుంది. అలాగే మడకశిర మండలం బుల్లసముద్రం, హరేసముద్రం, మనూరు, కల్లుమర్రి గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు సోలార్ పరిశ్రమలు ముందుకువచ్చాయి. ఇలా మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 3043ఎకరాల భూములను సిద్ధం చేశారు. మడకశిర ప్రాంత వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు అమరాపురంలో వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేసి స్థల పరిశీలన చేశారు.

చిలమత్తూరులో పారిశ్రామిక క్లస్టర్

కర్ణాటక సరిహద్దు టేకులోడులో 1105 ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టేకులోడు వద్ద ఇప్పటికే 225 ఎకరాల్లో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3.5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో తాగునీటి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. ఇక్కడే మరో 880 ఎకరాల భూములు సేకరించడానికి ఏపీఐఐసీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. పుట్టపర్తిలో రూ.ఏడు కోట్లతో కప్పలబండ పారిశ్రామిక పార్కులో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాలో పర్యటించి జిల్లాలో పారిశ్రామికవాడతోపాటు ఎంఎస్ఎంఈ పార్కుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టనుంది.



టేకులోడు పారిశ్రామిక పార్కు



ఎన్నికల ముందు వర్చువల్‌గా కలెక్టరేట్‌లో అప్పటి సీఎం జగన్ ఆవిష్కరించిన పరిశ్రమల శంకుస్థానం శిలాఫలకం

ఎన్నికల ముందు హడావుడి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి పేరుతో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పారిశ్రామిక అభివృద్ధి డ్రామాకు తెర తీశారు. హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేశారు. వర్చువల్ విధానం ద్వారా కదిరి మండలం పట్నంలో రూ.4,41 కోట్లతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, సోమందేపల్లి గుడిపల్లి వద్ద రూ. 125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమేటివ్ ప్లాస్టిక్ ప్రైవేట్ కంపెనీ, మడకశిర మండలం ఆర్ అనంతపురం వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ కంపెనీల పనులకు సీఎం హోదాలో భూమి పూజ చేశారు. ఈమూడు పరిశ్రమలు ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ప్రత్యక్షంగా 1370 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని గొప్పగా చెప్పారు. ఈక్రమంలోనే పుట్టపర్తి జిల్లా కేంద్రం కప్పలబండ పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ. 11.71 కోట్లు, హిందూపురం పారిశ్రామికవాడకు రూ7.15 కోట్ల నిధులు మంజూరు చేశారు. పారిశ్రామిక వాడల్లో సూక్ష్మ, చిన్న తరహా సంస్థల అభివృద్ధి కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల ఏర్పాటుకు ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఇవేవి ఒక్క అడుగు ముందుకుసాగకపోగా వర్చువల్ శంకుస్థాపనలకే పరితమయ్యాయి. పెనుకొండ, గుడిపల్లి, గోళ్లాపురం, ఎర్రమంచి, రాళ్లఅనంతపురం, కొటిపి, కదిరి కూటగూళ్ల, శెట్టిపల్లి, దాదలూరు, కేతగానిచెరువు, కప్పలబండ వద్ద పారిశ్రామిక పార్కులతోపాటు భూములు సిద్ధంగా ఉన్నా ఈభూముల్లో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయింది.

అనంత జిల్లాలో...

అనంతపురం జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే 2023 -2027 పాలసీని రద్దు చేశారు. ఈ ఏడాది అక్టోబరులో 2024- 2029 కొత్త పరిశ్రమల పాలసీని ప్రవేశపెట్టారు. అక్టోబరు 24 నుంచి కొత్త పాలసీ అమలవుతుంది. ఆ మేరకు జీవో జారీ చేశారు. త్వరలోనే గైడ్‌లైన్స్ జారీ చేసి, పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు యోచన



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు,అంబికా, బీకే, మంత్రి కేశవ్ (ఫైల్)

జిల్లా నుంచి ఉద్యాన పంటల ఎగుమతి కోసం విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ ఏడాది జూలై నెలలో జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉమ్మడి అనంత జిల్లా ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఏవియేషన్ ట్రైనింగ్ కోసం కృషి చేయాలని కోరారు. ఇదే అమలైతే దక్షణాదిలోనే మొట్ట మొదటి ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతి కేంద్రంగా, విమానాశ్రయంగా జిల్లా గుర్తింపు పొందనుంది.

పారిశ్రామికవేత్తలకు వైసీపీ మొండిచేయి

పారిశ్రామికవేత్తలకు వైసీపీ ప్రభుత్వం మొండి చేయి చూపింది. 2021 సెప్టెంబరు మాసం నుంచి గత ఏడాది మంజూరైన పరిశ్రమలు, పలు రకాల వాహనాలకు అందాల్సిన సబ్సిడీ డబ్బులను ప్రభుత్వం ఆపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, జగనన్న బడుగు వికాసం పథకాలకు సంబంధించి సేవా రంగం, ఉత్పత్తి రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోపాటు పలు రకాల వాహనాలు కొనుగోలు చేసిన లబ్దిదారులకు సబ్సిడీ డబ్బులు చెల్లించలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ సర్కార్ నిర్వాకంతో జిల్లా వ్యాప్తంగా 595 యూనిట్లకు సంబంధించిన రూ.70 కోట్లకుపైగా సబ్సిడీ మొత్తం పెండింగ్‌లో ఉండిపోయింది.



వైసీపీ ఐదేళ్ల పాలనలో కప్పలబండ పారిశ్రామిక వాడ ఇలా..

2023-27 పాలసీ ఆలస్యంగా అమలుతో అన్యాయం

గత ప్రభుత్వం 2023- 2027 పారిశ్రామిక పెట్టుబడి పాలసీని ఆలస్యంగా అమలు చేయడంతో తీవ్ర అన్యాయం జరిగింది. 2023 ఏప్రిల్ నుంచి కొత్త పాలసీని అమలు చేయాల్సి ఉంది. అయితే అప్పట్లో కేవలం సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. గైడ్‌లైన్స్, జీవోలను విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశం లేకుండా పోయింది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పాత వారికే సబ్సిడీ డబ్బులు ఇవ్వని ప్రభుత్వం కొత్త వారికి ఎప్పుడు ఇస్తుందన్న అభద్రతా భావంతో అనేక మంది కొత్తగా పరిశ్రమలు, ట్రాన్స్‌పోర్టు యూనిట్లకు దరఖాస్తు చేసుకునేందుకు వెనుకంజ వేశారు.



ఆరునెలల్లో కప్పలబండ పారిశ్రామిక పార్కు విస్తరణ దిశగా కూటమి ప్రభుత్వం

కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటుకు చర్యలు

వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడల ఏర్పాటును పూర్తిగా విస్మరించింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేలా నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు, మడకశిరలో పారిశ్రామిక వాడలు ఏర్పాటులో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. అందుకు సంబంధించిన స్థలం సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లాలోని కూడేరు పరిధిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం 353 ఎకరాలను సేకరించారు.

జడ్పీ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ నూతన సీఈఓగా రామచంద్రారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల డ్వామా పీడీగా పనిచేస్తున్న ఆయనను ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా నవంబరు నెలలో అనంతపురం జిల్లా సీఈఓగా నియమించారు. అయి తే దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో...అప్పట్లో విధుల్లో చేరలేదు. దీంతో డిప్యూటీ సీఈఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సెలవుల అనంతరం జిల్లాకు వచ్చిన ఆయన డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సీఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. కొత్త సీఈఓను జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలిసిన కొత్త సీఈఓ, డిప్యూటీ సీఈఓ

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

ఎస్ఎస్‌బీఎన్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సాయిబాబా అనుగ్రహంతో పెరిగిన మహావృక్షమే ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆ విద్యాసంస్థల 80 వార్షికోత్సవాలకు సంబంధించి శనివారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యాసంస్థ స్థాపించి 80 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో... అప్పటి అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత అధ్యాప కులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 3, 4, 5 తేదీలలో మూడ్రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు సంబంధించి భారీస్థాయి లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కావున పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించి దేశం నలుమూలల స్థిరపడిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి సుంకు వేణుగోపాల్, కోశాధికారి చంద్రశేఖర్‌గుప్త, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములపై కార్పొరేట్ల కన్ను: సీపీఐ

అనంతపురం విద్య, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సోలార్, గాలిమరల పేరుతో రైతుల భూములను కాజేయడానికి అదానీ, కార్పొరేట్ శక్తులు కుట్రలు చేస్తున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ రైతుల భూములను 20 ఏళ్లకు లీజుకు తీసుకుని, వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకుని సోలార్, గాలిమరల కంపెనీలు ఏర్పాటు చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 50 శాతం రాయితీలు కూడా తీసుకుంటారన్నారు. అనంతపురంలో జిల్లాలో పండే పండ్లను కార్గో విమానాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. హంద్రీనీవా కాలువను కూడా వెడల్పు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సోలార్, గాలిమరల కంపెనీలకు తమ భూములిచ్చి నష్టపోవద్దని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపేలా ప్రణాళిక సిద్ధం చేశాడన్నారు. దొంగే దొంగ అన్నట్లు ఇప్పుడేమో ఆయనే కరెంటు చార్జీలపై ధర్నాలు చేయడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే కూటమి ప్రభుత్వం కూడా చార్జీలు పెంచడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, ఇతర నేతలు నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

జీవో 77 రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల నేతలు

పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, వైఎస్ఆర్ సీపీ, ఏఐవైఎఫ్ తదితర సంఘాల నేతలు సీపీఐ ఆఫీస్‌లో సమావేశం నిర్వహించారు. నాయకులు కుళ్లాయిస్వామి, నరేష్, చంద్రశేఖర్, హనుమంతు రాయుడు తదితరులు మాట్లాడుతతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3580 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న విజయవాడలో దీక్ష జరుగుతుందని, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు.

కుష్ఠును తొలిదశలో గుర్తిస్తే కట్టడి సులభం

జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు అనుపమ జేమ్స్

అనంతపురం టౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వైకల్యం రాకుండా అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కుష్ఠు నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శనివారం నెలవారి సమీక్ష నిర్వహించారు. ఇంటింటా సర్వే, కేసుల గుర్తింపు, చికిత్సలకు తీసుకున్న చర్యలు గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్ఠు అతి సాధారణమైనదని, ఈవ్యాధి ఏదశలో ఉన్నా ఆరునెలలు లేదా 12నెలలు మందులు వాడితే నయమవుతుందన్నారు. కానీ చాలామందికి దీనిపై అవగాహనలేక భయపడిపోతున్నారన్నారు. ఇంకొందరు బయటకు చెప్ప కుండా దాచిపెట్టుకుని తీవ్ర సమస్యగా తెచ్చుకుంటున్నారన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి ఒక్కరిని గుర్తించి వారికి తగిన సమయంలో వైద్యం అందించి వ్యాధి నుంచి కాపాడాలనే సర్వే చేపడుతోందన్నారు. ఈసర్వేలో అనుమానపు లక్షణాలు మచ్చలు ఉన్నవారిని గుర్తించి, వారికి కుష్ఠు పరీక్షలు నిర్వహించా లన్నారు. ఒకవేళ కుష్ఠు అనే అనుమానం వస్తే వారు నిబంధనల మేరకు చికిత్స, మందులు వాడేలా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. ఈవిషయంలో పారామెడికల్ ఆఫీసర్లు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల లోనే ఉచితంగా మందులు ఇస్తారని, ఎక్కడా మందులు లేవనే మాటరాకుండా చూడాలన్నారు. బాధితులకు ప్రభుత్వం రూ.ఆరువేలు పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టరు గంగాధరరెడ్డి, డాక్టరు శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, సత్యనారాయణ, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టరు అనుపమజేమ్స్

పీఎం ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోండి

జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని మాజీ సైనికులు... పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి తిమ్మప్ప సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొ న్నారు. ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులు తమ పిల్లల ఉపకార వేతనం కోసం సోమవారం నుంచి జనవరి 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరి న్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-241146కు సంప్రదించాలన్నారు.

31న సినీగేయ వజ్రోత్సవ సదస్సు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఈ నెల 31న సినీగేయ వజ్రోత్సవ సదస్సును నిర్వహించనున్నట్లు పీఆర్వో ప్రొఫసర్ రామగోపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నందమూరి తారక రామారావు నటించిన తొలిచిత్రం 'మన దేశం' విడుదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. తెలుగు తులనాత్మక సాహిత్య శాఖ, మహాబోధి సాహిత్యశాఖ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేస్తే సదస్సుకు ముఖ్యతి అతిథిగా వర్సిటీ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి హాజరవుతారని తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు

నార్పల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరుకు చెందిన ఆదినారాయణ, సరస్వతి దంపతుల కుమారుడు జయసాయి అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ శనివారం తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సున్న జయసాయి చెవుడు, మూగ వాడన్నారు. వారం నుంచి కనిపించటం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే సెల్ ఫోన్ నంబర్లు 9849498492, 9966163496 సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.



జయసాయి

క్రైం కార్నర్

ఉపాధ్యాయుడి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

కూడేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామం వద్ద ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్స్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న భాస్కర్‌బాబు కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రాజు అందించిన వివరాల మేరకు.. అనంతపురం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు భాస్కర్‌బాబు తాను రూ.60 లక్షలు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులుకు ఇచ్చానని, తిరిగి ఇవ్వకపోవడంతో బ్యాంకుల్లో, ఈఐఎంఐల ద్వారా తీసుకున్న అప్పులు చెల్లించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్లో రాసిన విషయం తెలిసిందే. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై కేసు

ఉరవకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు మరో 16 మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు అనుమతులు తీసుకోకుండా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారని, ఆ శాఖ అధికారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, వైసీపీ నాయకుల ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగాయని ఫిర్యాదు చేశారు. రెండు ఫిర్యాదుల మేరకు మాజీ ఎమ్మెల్యే, 16 మంది, మరికొందరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ మహానంది శనివారం తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు


నిందితులతో సీఐ, సిబ్బంది

గుంతకల్లు టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తతో పాటు ఇద్దరు స్నేహితులను శనివారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన చాకలి రఘురాముడు దోసులుడికి గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. రఘురాముడు అతని భార్య సురేఖ(28)మీద అనుమానం పెంచుకొని హత్యచేయాలని పథకం రచించాడన్నారు. దోసులుడికి గ్రామానికి చెందిన అరికిచెర్ల రామ్మోహన్, గుంతకల్లు పట్టణం భాగ్యనగర్‌కు చెందిన షేక్ మస్తాన్‌వలి సహాయం తీసుకున్నాడు. ఈనెల 3వ తేదీన నీకు మంచిఉద్యోగం ఇప్పిస్తానని భార్య సురేఖను గుంతకల్లులోని గుత్తిరోడ్డులో ఉన్న తన స్నేహితుడు రామ్మోహన్ బోరుగుల షాప్ వద్దకు పిలిపించాడన్నారు. భర్త రఘురాముడు, రామ్మోహన్‌లు సురేఖను షాపులో తీసుకెళ్లి ఆమెను చున్నీతో గొంతు నులిమి హత్య చేశారు. సురేఖ మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో కట్టి మరో స్నేహితుడైన మస్తాన్‌వలిని పిలిచి అతని సహాయంతో శవాన్ని పాతకొత్తచెరువు గ్రామంలోని చెరువులో పడేశారన్నారు. తన భార్య కనిపించటం లేదని రఘురాముడు టూటౌన్‌పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతురాలి కాల్ డేటా, రఘురాముడు కాల్‌డేటా పరిశీలించి, సీసీ కెమెరా ద్వారా ఆధారాలను సేకరించామన్నారు. రఘురాముడు మీద అనుమానంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా హత్యచేసి చెరువులో పడేసినట్లు నేరం ఒప్పుకున్నాడన్నారు. శనివారం ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కుందుర్పి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సంపల్లిలో వెలసిన శివాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు పశువుల కాపరులు శనివారం గుర్తించారు. పురాతన శివాలయం కుందుర్పి, అల్లాపురం గ్రామాల మధ్య ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు చేపట్టారు.

మిద్దెపై నుంచి పడి కార్మికుడి మృతి

తాడిపత్రి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన కంబగిరి(40) అనే కార్మికుడు శనివారం మిద్దెపైనుంచి జారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కంబగిరి బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటిపైకి మెట్లు ఎక్కుతుండగా జారి కిందపడి మృతిచెందాడు. కంబగిరికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు.

పప్పుశనగకు.. వాన దెబ్బ..!

- వర్షానికి కుళ్లిపోతున్న పైరు
- 500 ఎకరాలకుపైనే దెబ్బతిన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు

పుట్లూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అసలే తెగుళ్లతో సతమతమవుతున్న పప్పుశనగ రైతులను జడివాన తీవ్ర ఇబ్బంది పెడుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న జల్లులకు పైరు కుళ్లిపోతోంది. బూజుతెగులు, ఎండు తెగులు ఉధృతితో వందల ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. మండలంలో 15300ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగుచేశారు. వీటిలో సుమారు 500ఎకరాలకు పైగానే పంట కుళ్లిపోయి దెబ్బతింది. శనగలగూడూరు, నారాయణపల్లి, గాండ్లపాడు, ఎస్. తిమ్మాపురం, తక్కళ్లపల్లి, పుట్లూరు, చాలవేముల, వెంగన్నపల్లి, గోపరాజుపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో తెగుళ్లకు వాన తోడవడంతో పంట కుళ్లిపోతోంది. గతంలో ఎకరాకు 5 క్వింటాళ్ల నుంచి 8క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం వర్షం దెబ్బతో ఎకరాకు రెండు మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కూడా కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దెబ్బతిన్న పప్పుశనగ పంట


పూతదశలో ఉన్న పంట

పూతదశలో వర్షం దెబ్బ

శనగపంట ఎదుగుదలకు ఎండ ఎక్కువగా ఉండాలి. అయితే గత వారం రోజుల నుంచి ఆకాశం మబ్బులతో నిండి ఉంటోంది. దీంతో పంటలో తెగుళ్ల ఉధృతి పెరిగింది. వంక నారవల్లో ఉన్న పైరుకు నీటిశాతం ఎక్కువ అవడంతో కుళ్లిపోతోంది. పంట పూతదశలో ఉండి బుడ్డలు పడే సమయం వచ్చింది. ఇప్పుడు వర్షం పడటం వల్ల పూతరాలిపోతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పులుపు మొత్తం పోయినట్లు పేర్కొన్నారు. పడిన వర్షం మొక్క కాండం కిందకు దిగి కుళ్లిపోతున్నట్లు చెబుతున్నారు.

పంట మొత్తం దెబ్బతింది



ఈ ఏడాది వర్షం బాగా వచ్చింది. పంటలు కూడా బాగా పండుతాయని అనుకుంటున్న సమయంలో వర్షం మా ఆశలపై నీళ్లు పోసింది. నేను 13ఎకరాల్లో పప్పువనగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయా. బుడ్డలు పడే సమయంలో వర్షం రావడంతో అవి నాశులుగా తయారయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది కూడా రైతులు నష్టపోవాల్సి ఉంటుంది.

-నరసింహుడు, రైతు నారాయణపల్లి

కూలీల డబ్బులు కూడా రావు



పెట్టుబడి పోను కూలీల డబ్బులు కూడా వచ్చే అవకాశం లేదు. సాధారణంగా శనగకట్టె కోయడానికి ఎకరాకు ఆరు నుంచి 8 మంది పట్టే అవకాశం ఉంది. 15ఎకరాల్లో పంట సాగు చేశాను. ప్రస్తుతానికి సగంపైనే బూజుతెగులు, ఎండు తెగులుతో ఎండిపోయింది. ఉన్న అరకొర పంటలో సైతం వర్షం రాకతో బుడ్డలు వస్తాయో రావో అన్న సందేహాలు నెలకొని ఉన్నాయి.

- విశ్వనాథ్‌నాయుడు, రైతు, నారాయణపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



పప్పుశనగపంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉందని, తెగుళ్లు రాకుండా నాలుగు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశా. కానీ వర్షం దెబ్బతో పదిరోజుల నుంచి పంట స్వభావం మారిపోయింది. ఎండలు లేక పంట తెగుళ్ల బారినపడి కుళ్లిపోతోంది. సుమారు 10ఎకరాల్లో పంట సాగుచేశా. పెట్టిన పెట్టుబడి కూడా దక్కే అవకాశాలు లేవు. ప్రభుత్వం స్పందించి శనగ రైతులను ఆదుకోవాలి.

- చౌదరి, రైతు నారాయణపల్లి

దళారుల మాటలు నమ్మకండి

- ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగాలు
- జిల్లా ఎస్పీ జగదీష్


పీటీసీలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. పీటీసీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రక్రియలో వాడుతుండటం వలన ఎక్కడా అక్రమాలకు తావుండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు బాగా సాధన చేసి రావాలని సూచించారు.

అభ్యర్థులకు నిబంధనలు ఇలా..

ఈనెల 30 నుంచి జనవరి 17వరకు జరిగే ఈవెంట్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ అడ్మిట్‌కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5గంటలకు స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో హాజరు కావాలి. తమతోపాటు అడ్మిట్ కార్డ్, స్టేజ్-1, స్టేజ్-2, అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావడంతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. ఈవెంట్స్ ఉన్న అభ్యర్థులు అనంతపురం పీటీసీ తూర్పు గేటు నుంచి ప్రవేశించాలి.

- అభ్యర్థులతో పాటు ఎవరైనా వెంట వచ్చినా పీటీసీకి తూర్పున ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభమయ్యే పాయింట్ వద్దే ఆగిపోవాలి. ఈవెంట్స్ జరిగే ప్రదేశానికి అనుమతి ఉండదు. అభ్యర్థి ఒక్కరు మాత్రమే ఈవెంట్స్ ప్రదేశానికి రావాల్సి ఉంటుంది.
- ఈనెల 30న తెల్లవారుజామున 4గంటల నుంచి జనవరి 17వరకు పీటీసీకి తూర్పున ఉన్న రైల్వేట్రాక్ పక్కన ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఎలాంటి రాకపోకలు ఉండవు. ఈవెంట్స్ ముగిసే వరకు అన్ని రోజుల్లోనూ పోలీసులు ఈ ఆంక్షలు అమలు చేయనున్నారు.
- రాంనగర్, లక్ష్మీనగర్ మిట్టల మీదుగా మొదటి, రెండో, మూడో తదితర రోడ్లకువెళ్లే వాహనదారులు లక్ష్మీనగర్ నాగులకట్ట నుంచి సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్, జన్మభూమి రోడ్డుల మీదుగా నడిమివంక మీదుగా వెళ్లాలి.
- మొదటి, రెండో, మూడో తదితర రోడ్ల నుంచి రాంనగర్, లక్ష్మీనగర్, రహమత్‌నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లే వాహనదారులు పీటీసీ ఉత్తరం వైపునున్న సర్వీసురోడ్డు ద్వారా నడిమివంక, జన్మభూమి రోడ్డు, సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్ మీదుగా లక్ష్మీనగర్ నాగులకట్ట నుంచి వెళ్లాలి.

పోలీసుల ఓవరాక్షన్

- బూతులు తిడుతూ కాలితో తన్నుతూ...
- డ్రెంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తిపై దాడి


హేమకుమార్‌పై దాడి చేస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీసులే ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. పత్రికల్లో రాయలేని పదాలతో దూషిస్తూ బూటు కాళ్లతో తన్నారు. ఇదంతా అనంతపురం ట్రాఫిక్ సీఐ సమక్షంలోనే జరగడం గమనార్హం. ఈ దృశ్యాలన్నీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

ఏం జరిగిందంటే...

ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి నగరంలోని క్లాక్‌టవర్ ఎదుట ట్రాఫిక్ సీఐ రఘుప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. నగరానికే చెందిన హేమకుమార్ బైక్‌లో వస్తూ పట్టుబడ్డాడు. టెస్ట్ చేశాక జరిమానా విధించారు. కొందరిని వదిలేస్తారు మాలాంటి వాళ్లను పట్టుకుంటారని ఆ సమయంలో హేమకుమార్ పోలీసులనుద్దేశించి వ్యంగ్యంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రెచ్చిపోయారు. లం..కొడకా మమ్మల్నే మాట్లాడతావా అంటూ దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దారు. బూతులు తిడుతూ బూటు కాలితో తన్నారు. ట్రాఫిక్ పోలీసులు బాబు, రాజేష్, రమేష్ తదితరులు హేమకుమార్‌పై దాడికి దిగారు. ఇదంతా సీఐ సమక్షంలో జరగడం విమర్శలకు తావిచ్చింది. సిబ్బందిలో ఒకరు కొట్టకండి. స్టేషన్‌కు తీసుకెళ్దామన్నా పట్టించుకునే పరిస్థితిలో లేకుండా పోలీసులు చితకబాదారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోనూ కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీన్ని వీక్షించిన పలువురు పోలీసుల తీరును తీవ్రంగా విమర్శిస్తున్నారు.

పోక్సో కేసులు.. ఇద్దరి అరెస్టు

గార్లదిన్నె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పలకొండ గ్రామానికి చెందిన యువకుడు సుధీర్‌పై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కొప్పలకొండ గ్రామానికి చెందిన సుధీర్ గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకునేవాడు. అయితే మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికతో ఇతడికి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట సుధీర్ ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిని శనివారం రాత్రి అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో..: గుత్తిఆర్‌ఎస్‌కు చెందిన యువకుడు వడ్డె అనిల్‌కుమార్‌ను పోక్సో కేసులో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 24న గుత్తి ఆర్‌ఎస్‌లో బాలికను అపహరించిన కేసులో నిందితుడిపై అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వేస్టేషన్ సమీపం వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం


వేపరాలలో అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్/గాండ్లపెంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో మామిడితోటలు మంచి పూతకు వచ్చే సమయమని, కాబట్టి రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. అలాగే గాండ్లపెంట మండలంలోని జీన్లకుంట, వేపరాల పంచాయతీల్లో మామిడి రైతులకు ఉద్యానశాఖ డివిజన్ అధికారి ప్రతాప్‌రెడ్డి శనివారం అవగాహన కల్పించారు. పూత లేదా పూత మొగ్గలు తొందరగా ఒకేసారి రావడానికి 13:0:45, 7 గ్రాములు ప్లస్ ఏదేని సూక్ష్మధాతువు రెండు గ్రాములు నుంచి మూడు గ్రాములు ఒకలీటరు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఇదివరకే 13:0:45 పిచికారి చేసిన రైతుకు 0:0:50 మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. తేనే మంచు పురుగు అగుపిస్తే తోటలో ఇమిడాక్లోప్రిడ్ - 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడం వలన బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. వర్షాలుపడి ఆగిపోయినందున పూతమొగ్గలపై మంచు ఏర్పడం పూతనల్లగా మారిపోయి పిందెకట్టకుండా రాలిపోయే అవకాశముందన్నారు. హెక్సాకొనజోల్ రెండు ఎంఎల్ లేదా తయోక్సినేట్‌మిథైల్ ఒక గ్రాము 0.3ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్‌తో కలిపి ఒక లీటరు నీటితో పిచికారి చేయాలన్నారు. జనవరి మొదటివారం వరకు కూడా పూమొగ్గలు రానట్లైతే ఒకసారి తేలికపాటి నీటి తడి ఇవ్వాలన్నారు. డ్రిప్ సౌకర్యం ఉన్నవారు డ్రిప్ ద్వారా 0:0:50 అనే నీటిలో కరిగే ఎరువును 2.5 నుంచి మూడు కేజీలు ఒకసారి ఎకరాకు వదులుకోవాలన్నారు. ఈవిధంగా చేయడం వల్ల ప్రస్తుత వాతావరణంలో మామిడిలో నష్టనివారణ చేయవచ్చన్నారు.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 8, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

న్యూస్ బాక్స్..

ప్రభుత్వాస్పత్రి తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

ధర్మవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రతి వార్డును పరిశీలించి వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవిని అడిగితెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించారు. ఐసీటీఎస్ కేంద్రాన్ని తనిఖీ చేసి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌కు సంబంధించిన వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యులు నజీర్, ఏఓ వాసుప్రకాశ్, సీఐ జమీర్‌బాషా, కానిస్టేబుల్ చంద్ర ఉన్నారు.

హమాలీలకు ఇంటి స్థలాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హమాలీలు అద్దె ఇళ్లల్లో నివాసముంటున్నారని, వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, నాయకులు బోణాల రామాంజి మాట్లాడుతూ..హమాలీలు ఎన్నోయేళ్లగా ఇళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి స్థలాలు ఇవ్వాలని గత ప్రభుత్వంలో విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అధికారులు స్పందించి ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రమణ, హమాలీలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

ధర్మవరంరూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(సొసైటీ) బ్యాంకు నందు ఓటు హక్కు కలిగిన రైతులు సచివాలయాల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జ్ లీలావతమ్మ, సంఘం సీఈఓ నారాయణస్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం యొక్క కంప్యూటరైజేషన్‌లో భాగంగా ఈ కేవైసీ చేయించుకుంటే ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ , ఇన్సూరెన్స్‌లు, వడ్డీలు వర్తిస్తాయన్నారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

● నల్లమాడ : నల్లమాడ ప్రాథమిక సహకార సంఘంలో వ్యవసాయ రుణాలున్న రైతలుందరూ తప్పకుండా సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం సీఈఓ కేశవులు శనివారం తెలిపారు. సహకార సంఘంలో ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అందించే పథకాలు దక్కవన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించండి

నంబులపూలకుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు పన్నులు జమ చేస్తేనే గ్రంథాలయాల అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి పి.రమా అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించిన ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో పనిచేస్తే ఉద్యోగికి 75 శాతం గ్రంథాలయ శాఖ నుంచి జమ అయితే పంచాయతీల నుంచి 25 శాతం జమ చేయాల్సి ఉందన్నారు. ఐదేళ్ల నుంచి ఒక్క రూపాయి కుడా పన్ను జమ కాలేదన్నారు. పంచాయతీలు క్రమం తప్పకుండా పన్ను చెల్లిస్తే నూతన పుస్తకొనుగోలు చేసే అవకాశముందన్నారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారిని శాంతమ్మ ఉన్నారు.

వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ధర్మవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను జనవరి 11న ప్రభుత్వమే నిర్వహించాలని వడ్డేసంఘం నాయకుడు పల్లపురవీంద్ర కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వడ్డే ఓబన్న ప్రాణాలు తెగించి దేశం కోసం పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెరసంఘం నాయకులు అంజి, శంకర, దివాకర్, అనిల్, శివరాం, రమేశ్, నరేంద్ర పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

బుక్కపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికచట్టాలను అమలు చేసి, కార్మికులకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మార్పీ కార్యాలయం వద్ద మండల సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఇందులో సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా బేళ్ల అంజి, కో కన్వీనర్లగా నాగమణి, మంజుల, రామదాసుతోపాటు 14మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ సెంటర్లపై అవగాహన

బుక్కపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో శనివారం పోలీసులు చైల్డ్ హెల్ప్ లైన్ సెంటర్లపై అవగాహన కల్పించారు. పుట్టపర్తి మహిళ పోలీస్ స్టేషన్ సీఐ గోపీనాథ్‌రెడ్డి, బుక్కపట్నం ఎస్ఐ క్రిష్ణమూర్తి ఈ అవగాహన కల్పించారు. బాలికలపై జరుగుతున్న నేరాలు, దాడులు, సైబర్ క్రైమ్ తదితర వాటి గురించి క్షుణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



నల్లచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ పి. రవీంద్రరాజు తెలిపారు.

దుస్తుల పంపిణీ

ముదిగుబ్బ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లవారిపల్లిలో యేసుకృపా మినిస్ట్రీస్, రాచానపల్లి వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాపాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో 85 మంది పేదలకు దుస్తులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ నవీన్ కుమార్, గ్రామ ఉపసర్పంచ్ చిన్నప్పయ్య, కోనయ్య, వేమ నారాయణ, చంద్రప్ప, పాస్టర్ ఫలిఫ్, అమృతమ్మ పాల్గొన్నారు.

అయ్యో వేమా..!

యోగివేమన ... పామరుల నుంచి పండితులు వరకు తెలుగులో అందరికీ చక్కగా అర్థమయ్యేలా వేలాది పద్యాలు రాశారు. సమాజంలోని అంటరానితనం .. కులమత విభేదాలను రూపుమాపారు.. మానవత్వం.. సామాజిక బాధ్యత.. తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.. ప్రజల్లో చైతన్యం నింపారు. అలాంటి ప్రజాకవికి సొంత రాష్ట్రంలోనే సరైన గుర్తింపు లేదు. ఆ మహాకవి జయంతిని పాలకులు నేటికీ నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే యోగివేమనలో ప్రతిభను.. సంఘసంస్కర్తను గుర్తించిన పొరుగు రాష్ట్రమైన కర్ణాటక ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తోంది. దీనిపై ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు స్పందించాలని తెలుగు భాష ప్రేమికులు, కవులు కోరుతున్నారు.





యోగివేమన ఆలయం, వేమన విగ్రహం(ఇన్‌సెట్లో)

- యోగి వేమనను విస్మరించిన పాలకులు
- కర్ణాటకలో అధికారికంగా జయంతి ఉత్సవాలు
- సొంత రాష్ట్రంలో లేని గుర్తింపు
- ఈ సారైనా జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తారా.. ?

గాండ్లపెంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాత్వికుడు, సామాజిక విప్లవకారుడు తెలుగు ప్రజాకవి యోగివేమన సొంత రాష్ట్రంలోనే నిరాధరణకు గురవుతున్నారు. పాలకులు ఆయనకు కనీస గుర్తింపు ఇవ్వడం లేదు. ఈ తెలుగు కవిని పాలకులు పూర్తిగా మరిచిపోయారు. ఈయన గుంటూరు జిల్లా కొండవీడు సమీపంలోని మూగచింతలపల్లిలో 14 శతాబ్దంలో జన్మించారు. ఆయన వేలాది పద్యాలు రచించి.. ప్రజాల్లో చైతన్యం నింపి.. ప్రజాకవి.. మాహాకవి.. గొప్ప సంఘసంస్కర్తగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు వన్నె తెచ్చిన వారిల్లో ఈయన ప్రముఖుడు. ఆయన రచించిన పద్యాలను ప్రముఖ ఆంగ్ల కవి సీపీ బ్రౌన్ ఇంగ్లీష్‌లోకి అనువ దించారు. కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట మండలలోని కటారుపల్లిలో జీవ సమాధి అయ్యారు. ఆ సమాధిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్నారు. జనవరి 19న ప్రజాకవి యోగివేమన జయంతి ఉత్సవాలను సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గం, గాండ్లపెంట మండలంలోని కటారుపల్లిలో నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నది తెలుగు భాష ప్రేమికులు, కవుల చిరకాల కోరిక. గత ప్రభుత్వం హయాంలో నాటి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అసెంబ్లీలో వేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ప్రస్తావించారు. నాటి పర్యాటక శాఖమంత్రి రోజా వేమన జయంతి ఉత్సవాలను అధికారంగా ప్రకటించి, 2023లో మాత్రం ఈ ఉత్సవాలు నిర్వహించారు. 2024లో ఎలాంటి జయంతి ఉత్సవాలనూ నిర్వహిం చలేదు. దీనిపై తెలుగు భాష ప్రేమికులు, కవులతో పాటు పలువురు రెడ్ల సంఘం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● కర్ణాటకలో ఉత్సవాలు.. : కర్ణాటక రాష్ట్రంలో యోగివేమన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఏటా రూ.లక్షలు ఖర్చు చేసి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తెలుగువారై ఉండి కూడా ఇక్కడి పాలకులు యోగివేమనపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం విడ్డూరం. కనీసం తెలుగు భాషను మరచిపోయే నేటి బాలలకు, పౌరులకు తెలుగు అవస్యకత, వేమన రాసిన పద్యాలను ఒక్కరోజైనా స్మరించుకునేందుకు ఈ జయంతి ఉత్సవాలను అధికారంగా నిర్వహించాలని తెలుగు భాష ప్రేమికులు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి... రెడ్డికులానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఉన్నా కూడా, కనీసం వేమన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా వేమన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారికంగా నిర్వహించాలి



తెలుగు మహా కవి యోగి వేమన జయంతి ఉత్స వాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వ హించాలి. వేల పద్యాలు రచించి తెలుగువారి గుండెల్లో ఆయన స్థిరస్థాయిగా నిలిచిపోయారు. తన పద్యాలు అందరికీ సులభంగా అర్థమయ్యేలా రచించారు. ఆయన వల్ల తెలుగుభాష, తెలుగు సంస్కృతిక మరింత విస్తరించింది. అలాంటి తెలుగు కవిని పాలకులు విస్మరించడం అన్యాయం.

- హనుమంతురెడ్డి, మునగలవారిపల్లి

అనుమతులు లేవు

ప్రజాకవి యోగి వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులూ రాలేదు. వాటిని యూత్ అడ్వాన్సుమెంట్ టూరిజం కల్చర్ వారు నిర్వహిస్తారు.

- జయకుమార్ , జిల్లా పర్యాటక శాఖాధికారి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

చదువుతోనే అభివృద్ధి: న్యాయాధికారి

కదిరి లీగల్, డిసెంబర్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదవాలని.. అప్పుడే అభివృద్ధి సాధ్యమని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి సూచించారు. శనివారం కదిరి కుటాగుళ్ల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమెతో పాటు మరో న్యాయాధికారి ఎస్ ప్రతిమ పాల్గొన్నారు. జయలక్ష్మి మాట్లాడుతూ.. చదువులతో పాటు చట్టాలపై కూడా ప్రాథమిక దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయాధికారి ప్రతిమ మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. కొందరు పిల్లలు వాహనాలను నడుపుతూ చేస్తున్న విన్యాసాలు చూస్తే వణుకు పుడుతోందన్నారు. అప్పుడే ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులేనని హెచ్చరించారు. అనంతరం వ్యాసరచనలో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో ప్రిన్సిపాల్ కే రమా, ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి, న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీతపై పాఠశాలల్లో అవగాహన



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

నంబులపూలకుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భగవద్గీతపై పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తూ.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని సంచ్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, అంచల్ సాధక ప్రముఖ్ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో శనివారం నిర్వహించిన మాసిక వర్గ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి మండలంలో పది పాఠశాలల ప్రకారం జిల్లాలో మొత్తం 270 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. చదువుతోపాటు సంస్కారం, దేశభక్తి, దైవభక్తి, ఆటలు, కోలాటం, సూర్యనమస్కారాలు, ఆసనాలు, కట్టు, బొట్టు, హిందూ సంప్రదాయం తదితర వాటిపై ప్రతిరోజు మూడు గంటల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ తరగతులను ఆచార్యుడు కానీ, మాతాజీ నిర్వహిస్తారన్నారు. ఈకార్యక్రమంలో సంచ్ ప్రముఖ రాజేశ్వరీ, ఆచార్య, మాతాజీలు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై ప్రదర్శన

పుట్టపర్తిరూరల్ డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లిలో శ్రీవెంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా ఆధునిక వ్యవసాయంపై వైజ్ఞానిక ప్రదర్శన ను శనివారం నిర్వహించారు. దీన్ని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన వ్యవసాయ సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ పంటల్లో వచ్చే పురుగులు తెగుళ్ల వాటి నివారణ మార్గాలను రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోత్స్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమణమూర్తి, ఎస్వీయూ వ్యవసాయి కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓలేటి ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, వెంకటనాయుడు కోరారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల పీఎఫ్ బకాయిలు, డీఏ, ఐఆర్, ఈఎల్ ఆర్జిత సెలవులు నగదుగా మార్చుకునే అవకాశం కల్పించాలన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

ధర్మవరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపలి పెద్దన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ... జమిలీ ఎన్నికల పేరుతో ఫెడరల్ స్ఫూర్తికి బీజేపీ నాయకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మారుతిప్రసాద్, వెంకటనారాయణ, సకలరాజా, ముత్యాలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాబ్‌జాన్



బాబ్‌జాన్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

నంబులపూలకుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా షేక్ బాబ్‌జాన్‌ను ఎంపిక చేసినట్లు బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్‌నాయక్ తెలిపారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. బాబ్‌జాన్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన బీజేపీ నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ ఉత్తమరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తలుపుల గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మండల ఎన్నికలాధికారి వెంకటేష్, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు శరత్‌రెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకులు మైనోద్దీన్, మండల మాజీ అధ్యక్షుడు రామమోహన్, నాయకులు గురివిరెడ్డి, రామమోహన్, వెంకటరమణ, లక్ష్మీనర్సు, మోహన్‌రెడ్డి, సమీవుల్లా, జయరాం, చాంద్ బాషా, మహేష్ ర వి, నాగార్జునాయుడు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



ఎన్పీకుంట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

నంబులపూలకుంట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ వి. రత్న శనివారం తనిఖీచేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే సోలార్ హబ్‌ను పరిశీలించారు. సచివాలయం మహిళ పోలీసులతో చర్చించారు. ఆమె వెంట డీఎస్పీ శివనారాయణ స్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐలు వలీబాషా, నరసింహులు, మగ్బుల్‌బాషా, ఎఎస్ఐకిషోర్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

● తనకల్లు : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్పీ శనివారం తనిఖీ చేశారు. పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. ఆమె వెంట ఎస్ఐ గోపీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● గాండ్లపెంట : మండలంలోని కటారుపల్లి యోగివేమన ఆలయాన్ని, వేమన జీవ సమాధిని ఎస్పీ రత్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ పూజారులు సన్మానించారు. ఆలయం ఆవరణంలో వేమన పద్యాలను పరిశీలించారు. వేమన జీవిత చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

చిరుధాన్య వంటలతో ఆరోగ్యం



చిరుధాన్యాల వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

తనకల్లు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల వంటలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వాసన్ సంస్థ ప్రతినిధి ఉత్తప్ప పేర్కొన్నారు. శనివారం మండలంలోని గందోడివారిపల్లిలో చిరుధాన్యలతో వంటల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధరకాల వంటకానుల తీసుకువచ్చారు. వంటలను సమావేశానికి వచ్చిన అందరికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలపాటు చిరుధాన్యాల వంటకాల పోటీలను గ్రామంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థకు చెందిన రామమోహన్, జనజాగృతి ప్రతినిధులు గరుడప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

నల్లమాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పరికరాలు వాడే దివ్యాంగులు నల్లమాడ ఆర్డీటీ ఏరియా కార్యాలయానికి ఆదివారం రావాలని జీఓ ఎ. నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంకలో కట్టెలు, రబ్బరు కాళ్లు, వీల్‌చైర్, ట్రైసైకిల్ చేతికర్రలు వాడే వికలాంగులు ఆధార్, రేషన్‌కార్డు తీసుకుని ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. ఆర్డీటీ సంఘాల్లో ఉన్నా.. లేకున్నా రావాలని కోరారు.

క్రైం న్యూస్..

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ధర్మవరంరూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల-ధర్మవరం రైల్వేస్టేషన్ల మధ్యలో బడన్నపల్లి డూప్లెట్ రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వృద్ధుడు మరణించాడు. రైల్వే బ్రిడ్జి వద్ద ఓ వృద్ధుడు రైలు ఢీకొని చనిపోయి ఉండటాన్ని శనివారం కీమెన్ గుర్తించాడు. అతను నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 68 నుంచి 70 సంవత్సరాలు ఉంటాయని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలూ లభించకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94406 27640, 98667 15093 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్నకారు

ముదిగుబ్బ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లి సమీపం లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయ పడ్డారు. గుంజేపల్లి గ్రామానికి చెందిన శంకర్ పొలంలో పనిముగించుకుని రోటవేటర్ ఉన్న ట్రాక్టర్‌లో గుంజేపల్లి నుంచి ముదిగుబ్బ వైపు బయలుదేరాడు. మార్గ మధ్యలో రోటవేటర్ రేకు ఒక వైపు ఊడి పోవడంతో.. వెనకే వస్తున్న కారు దాన్ని బలంగా ఢీకొని.. రోడ్డు దిగువన ఆగిపోయింది. ఆ కారులో పులివెందులకు చెందిన విజయ్, ఆయన భార్య నిక్షత, కుమార్తె అక్షర ఉన్నారు. వీరు అనంతపురం నుంచి పులివెందులకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ను నడుపుతున్న శంకర్ తీవ్రంగా, విజయ్, నిక్షత స్వల్పంగా గాయపడ్డారు. శంకర్‌ను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బత్తలపల్లికి చెందిన రామాంజినేయులు శనివారం తహసిల్దార్ కార్యాలయం వద్దకు బయలుదేరాడు. ధర్మవరానికి చెందిన ఆదర్శ, ఆదిత్య తాడిపత్రికి బైక్‌పై బయలుదేరారు. ఈ రెండు బైక్‌లు స్థానిక ధర్మవరం రోడ్డులో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు ఆటోలో వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదర్శను బెంగళూరుకు, రామంజినేయులును అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నల్లచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరువాయి గ్రామానికి చెందిన సోమ, స్వాతి దంపతులు నల్లచెరువు వీవర్స్ కాలనీలో మగ్గం నేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. స్వాతి గుండె ఆపరేషన్‌కు రూ.మూడు లక్షలు కావాల్సిఉంది. ఈ విషయాన్ని వారు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. రెండు లక్షలు అందేలా కృషి చేశారు. ఆ చెక్కును స్థానిక టీడీపీ నాయకులు సోము, స్వాతికు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత ఉపాధ్యక్షుడు శ్రీరాములు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఏకల్ అభియాన్ నిర్వాహకులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మాతాజీలు

గోరంట్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగిరెడ్డిపల్లిలో ఏకల్ అభియాన్ మాతాజీలకు శనివారం శిక్షణ ఇచ్చారు. పెడబల్లి, పుట్టపర్తి, గోరంట్ల నుంచి 30మంది మాతాజీలు శిక్షణలో పాల్గొనగా, మన సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తిపై అవగాహన కల్పించారు. అనంతరం కోలాటం, తదితర ఆటలను ఏర్పాటు చేశారు. సంచ్ సమితి అధ్యక్షులు నరెద్దుల రాజారెడ్డి, మాతాజీలకు సిలబస్ పుస్తకాలు, నిర్వాహణ సామాగ్రి, డైరీలను అందించారు. ఈకార్యక్రమంలో అంచల్ అభియాన్ ప్రసాద్, మూల్యాంకన్ రామాంజనేయులు, అంచల్ ప్రతిక్షణ ప్రముఖ్ వెంకటనారాయణ, సంచ్ సంస్కార్ ప్రముఖ్ రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ



మోడల్ పేపర్ పుస్తకాలతో పులేరు విద్యార్థులు

గోరంట్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 40మంది విద్యార్థులకు మోడల్ పేపర్లను శనివారం పంపిణీ చేశారు. జీనవాండ్లపల్లికి చెందిన సాయి క్రిష్ణ పరీక్షల కోసం రూపొందించిన మోడల్ పేపర్ల పుస్తకాలను సొంత ఖర్చుతో సమకూర్చారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్షీనరసింహులు, మురళీ, క్రిష్ణమూర్తి, క్రిష్ణప్ప, నగేష్, ఓబులేసు, వెంకటేష్, గంగాధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెట్లకిందే విద్యార్థులకు బోధన

పరిగి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నర్సాపురం గ్రామ పంచాయతీలోని బీరేపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చెట్లకిందే విద్యాబోధన జరుగుతోంది. పురాతన గదులు శిథిలావస్థలో ఉన్నందున ఒకటే గది కావడంతో పలువురు విద్యార్థులకు ఆరుబయటే చెట్ల కింద విద్యబోధన చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ లక్ష్మీదేవిని వివరణ కోరగా పాఠశాల గదులకై ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని, నిధులు మంజూరైతే వెంటనే గదుల నిర్మాణం కొనసాగిస్తామన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐతోనే విద్యార్థుల సమస్యల పరిష్కారం



ఎస్‌ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో వారికి వారే బాటగా నిలిచేది ఎస్‌ఎఫ్ఐ అని ఆ సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జెండా ఆవిష్కరించి బాబావలి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంకు ముందుండేది ఎస్ఎఫ్ఐ అన్నారు. ప్రభుత్వమే నాణ్యమైన విద్యను విద్యార్థులందరికీ ఉచితంగా అందించాలని చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్లతో ఏర్పడింది ఎస్ఎఫ్ఐ అన్నారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులకు తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, పవన్, మూర్తి పాల్గొన్నారు.

రాగులను రైతు సేవా కేంద్రాల్లో విక్రయించాలి

సోమందేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన రాగులను రైతు సేవా కేంద్రాల్లో విక్రయించాలని జేసీ అభిషేక్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నల్గొండ్రాయనపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం రాగులకు మద్దతు ధర, క్వింటాల్‌కు రూ.4290 ప్రకటించిందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. రైతు సేవా కేంద్రంలో రాగులు విక్రయించే రైతులకు రవాణ ఖర్చులు లేబర్‌చార్జీలు, గోనుసంచులు ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. అదేవిధంగా రైతులు రాగులను అధికంగా పండించి విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎం అశ్వర్థనారాయణ, పెనుకొండ ఏడీఏ స్వయంప్రభ, తహసీల్దార్ రెడ్డిశేఖర్, వ్యవసాయాధికారి కవితారాణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు హరిక్రిష్ణ, నరసింహ, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు



గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

లేపాక్షి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి వార్షిక క్రీడోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ మంచి ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. తాము చదివేటప్పుడు విద్యావిధానం చాలా కష్టంగా ఉండేదని సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేవారు కాదన్నారు. అయినా కష్టపడిచదివి ఈ స్థాయిలో నిలబడ్డామన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ఆగిన రింగ్‌రోడ్డు ...

పెరిగిన ట్రాఫిక్

ఎడతెగని రద్దీతో తప్పని ఇబ్బందులు



మడకశిరటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కూడళ్ల లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరగడమే ఇందుకు కారణమని అందరికీ తెలిసినా ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు మాత్రం తప్పడం లేదు. గత ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి రింగ్‌రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అదికాస్తా అటకెక్కింది. దీంతో వాహనాలన్నీ పట్టణం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా రాజీవ్‌గాంధీ సర్కిల్ వాల్మీకి సర్కిళ్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. వారపు సంతరోజైన గురువారం రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది.

రింగ్ రోడ్డు నిర్మాణంతో సమస్యకు పరిష్కారం

గత ప్రభుత్వం రింగ్‌రోడ్డు నిర్మాణం చేపడుతుందని, సమస్య పరిష్కారం అవుతుందని అనుకొన్న సమయంలో ప్రభుత్వం మారడం వల్ల ఆ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. దీంతో వాహనాలన్నీ పట్టణంలో ప్రవేశించడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. ఇప్పటికైనా అధికారులు రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేసి వాహనాలను మళ్లిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.



రవికుమార్, బేగార్లపల్లి

వాహనాలు నిలిపేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలను రోడ్డు కు ఇరువైపులా నిలపడంతో రాక పోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మడకశిర మేజర్ పంచాయితీ నుంచి నగరపంచాయితీగా మారి పదిసంవత్సరాలు కావస్తోంది. గతంలో కంటే జనాభా కూడా పెరిగి పోయింది. కర్ణాటక సరిహద్దులో ఉండడం, ప్రధాన రహదారి కూడా పట్టణం సమీపం నుంచి వెళ్ళడంతో ట్రాఫిక్ పెరిగిపోయింది. పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల నుంచి, పక్క మండలాల నుంచి చదువుల కోసం, వ్యాపార నిమిత్తం అధిక సంఖ్యలో ప్రజలు పట్టణానికి వస్తుంటారు.

గత ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ప్రతిపాదించిన రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా కూడళ్లలో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తే, కొంత వరకు ట్రాఫిక్ సమస్యతీరుతుందని అంటున్నారు. వారపు సంత రోజు మాత్రం పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తారని, మిగతా రోజుల్లో రద్దీ అధికం కావడంతో రాక పోకలకు అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకుని వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని కనుక సమస్యను సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నేతలకు ధర్నా చేసే హక్కులేదు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినా ధర్నా చేసే నైతిక హక్కును వైసీపీ నేతలు కోల్పోయారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వల్లే విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, 2002 నుంచి ట్రూ అప్ ఛార్జీలు పెంచారన్న విషయాన్ని వైసీపీ నేతలు మరిచారని ధ్వజమెత్తారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్‌రంగాన్ని జగన్ భ్రష్టు పట్టించారని, 2022 నుండి 2024 వరకు రూ.17వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీలు పెంచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో చేపట్టిన ప్రజారంజక పాలన వల్ల వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు ధర్నాలు అంటూ రోడ్డు మీదకు వస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో రైతులను విస్మరించారని, వారిపై కపట ప్రేమను చూపుతూ ధర్నాలు సైతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చేసిన పాపాలు కప్పి పుచ్చుకోవడానికి ఎన్‌డీఏ ప్రభుత్వంపై నెపం నెటడం సరికాదన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి మరింత ప్రోత్సాహం అందించాల్సింది పోయి గతంలో వారు చేసిన తప్పుల వల్ల అభాండాలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, అందులో ఏమాత్రం రాజీ పడవద్దని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పరిశీలించారు. అనంతరం



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

విద్యార్థులను ఆరా తీశారు. భోజన నాణ్యతను పరిశీలించడంతోపాటు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు గుణాత్మకమైన, నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతుల పట్ల ఆరా తీశారు. ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

శిథిలావస్థలో కోడూరు సింగిల్ విండో కార్యాలయం

● వర్షం వస్తే రికార్డులన్నీ తడిసిపోవాల్సిందే

చిలమత్తూరు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధిలో మాత్రం వెనకబడింది. 1980 సంవత్సరంలో ప్రారంభమైన ఈ సంఘం పరిధిలో కోడూరు పంచాయతీతో పాటు శెట్టిపల్లి, దిగువపల్లి తండా పంచాయతీలు ఉన్నాయి. రైతులకు రుణ సదుపాయాలతో పాటు విత్తనాలు, ఎరువుల సరఫరా చేస్తూ ఈ సంఘం ఎన్నో సేవలు అందిస్తోంది. అయితే రైతులకు సంబంధించిన ఈ ప్రాథమిక వ్యవసాయ



శిథిలావస్థకు చేరిన కార్యాలయం



పెచ్చులు ఊడిన పైకప్పు

సహకార సంఘం భవనాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా రైతు భరోసా కేంద్రంగా మార్చింది. కానీ భవన మరమ్మతులు మాత్రం మరిచిపోయింది. ఎన్నో ఏళ్లగా రైతులకు రుణసదుపాయాలు అందించిన ఈ సింగిల్ విండో కార్యాలయానికి కనీసం బోర్డు కూడా లేకపోవడం విశేషం. ప్రారంభంలో ఈ సంఘం ద్వారా వేలాది మందికి పంట రుణాలు అందాయి. అయితే ఈ ప్రాంతం పూర్తిగా సెజ్ పరిధిలోకి రావడంతో వ్యవసాయ భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దాంతో చాలా మంది రైతులు తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. ఈ తరుణంలో సంఘం కూడా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోవలసి వచ్చింది. ప్రస్తుతం సంఘంలో 1381 మంది రైతులు మాత్రమే సభ్యులుగా రుణ సదుపాయాన్ని పొందుతున్నారు. ప్రతి ఏటా రూ. 90 లక్షల వరకు టర్నోవర్ కలిగి ఉంది. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఈ సంఘం నుంచి మొదటి ప్రాధాన్యతగా రుణాలు అందుతున్నాయి. అయితే రైతులకు ఎన్నో సేవలు అందిస్తున్న ఈ సంఘం కార్యాలయం ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటోంది. భవనం చాలా కాలం క్రితం నిర్మించింది కావడంతో భవనం పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. రుణాల కోసం రైతులు తాకట్టు పెట్టిన భూముల రికార్డులకు కూడా భద్రత లేకుండా పోయింది. వర్షం వస్తే పైకప్పు లీకేజి అవుతుండటంతో రికార్డులు తడిసిపోయి పాడవుతున్నాయి. ఎంతో ఘన కీర్తి కలిగిన సంఘం...ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.

ఎంపీడీఓపై దాడి హేయమైన చర్య



గోరంట్లలో నిరసన తెలుపుతున్న సిబ్బంది

గోరంట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడి జరపడం హేయమైన చర్య అని గోరంట్ల ఎంపీడీఓ నరేంద్ర కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు భోజనం విరామ సమయంలో శనివారం నిరసన చేపట్టారు. నిందితులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వెంటనే స్పందించి బాధితులను పరామర్శించి నిందితులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ కార్యాలయ అధికారులు సూర్యనారాయణ, నవీన్, నిరంజన్‌రెడ్డి,సతీష్, కార్యదర్శులు, సిబ్బంది, ఉపాధి, గృహనిర్మాణ శాఖాధికారులు పాల్గొన్నారు.

పెనుకొండలో నిరసన వ్యక్తం చేసిన ఉద్యోగులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీఓ జవహర్‌పై దాడి చేయడంపై శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు అధికారులు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని అధికారులు డిమాండ్ చేశారు. కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేషకృష్ణ, తహసీల్దార్ శ్రీధర్, ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సోమందేపల్లిలో..

సోమందేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, అనుచరులు దాడిచేయడం అమానుషమని జనసేన నాయకులు నాగరాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే వారు ఉన్నారన్నారు. ఒకవేళ పనిచేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అలా కాకుండా భౌతిక దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు తమ దౌర్జన్యాలు, అరాచకాలు కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. దళిత ఎంపీడీఓపై దాడిచేసి దుర్భాషలాడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి: ఏపీఎస్‌టీఏ

మడకశిరటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీవోనెంబర్ 117 ను రద్దు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని ఏపీఎస్‌టీఏ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు టి.మారుతీప్రసాద్ అన్నారు. శనివారం మాశేరొప్పం ప్రాథమిక పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో మడకశిర మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే పేరివిజన్ కమీషన్ ఛైర్మన్‌ను నియమించాలని కోరారు. మెగా డీఎస్సీని భర్తీ చేయాలన్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులుగా ఆర్.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశ్వర్థనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా విష్ణు, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, నరసింహమూర్తి, లక్ష్మీనరసమ్మ, ఇమ్రాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీగా నాగరాజాచారి, కోశాధికారిగా నరసింహమూర్తి తదితరులను ఎన్నుకొన్నట్లు తెలిపారు.

విద్యుత్ వైర్లు తెగిపడి గేదెల మృతి



విద్యుత్ వైర్లు తెగిపడటంతో మృతిచెందిన గేదెలు

మడకశిర రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని సిద్దిగిరి గ్రామ సమీపలో శనివారం మధ్యాహ్నం 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డతో రెండు గేదెలు మృతిచెందాయి. బాధిత పాడి రైతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామ సమీపంలోని పొలాల్లో గేదెలు మేపుతుండగా, ఒక్కసారిగా పై నుంచి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయన్నారు. ఆ విద్యుత్ వైర్లు పడ్డంతో రెండు గేదెలు అక్కడి అక్కడే మృతిచెందినట్లు రైతు తెలిపారు. తాను రూ.2 లక్షలు వరకు నష్టాపోయానని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ ఏ ఈ విశ్వనాథ్,లైన్ మ్యాన్‌బాలకృష్ణ ఘటన స్థలానికి చెరుకోని తెగిపడిన విద్యుత్ వైర్లను,మృతి చెందిన గేదెలను పరిశీలించారు. విద్యుత్ ఏఈ విశ్వనాథ్ మాట్లాడుతూ నీలకంఠాపురం సబ్ స్టేషన్ నుంచి గుడ్డంపల్లి గ్రామం వరకు లాగిన 11 కేవీ విద్యుత్ లైన్ వైర్లు పాతవి కావడంతో తెగిపడి పాడిగేదెలు మృతి చెందినట్లు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఎల్‌సీడీ రైటింగ్ ప్యాడ్‌లు



విద్యార్థులకు ఎల్‌సీడీ రైటింగ్ ప్యాడ్‌లను అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎల్‌సీడీ రైటింగ్ ప్యాడ్ లు వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 36మంది విద్యార్థులకు పోతిరెడ్డికుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మంజునాథ్‌రెడ్డి రూ10వేలు విలువచేసే ప్యాడ్‌లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీడీపీ నాయకులు పోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత గణిత దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు క్విజ్‌పోటీలు దోహదపడతాయన్నారు. మేధాశక్తిని పెంపొందించేందుకు అలాగే పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా, కృష్ణమూర్తి, వరలక్ష్మీ, రామాంజినేయులు, ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ముద్దయ్య శిక్షణతో విద్యార్థులలో చైతన్యం

పావగడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంతటి బండరాయినైనా చెక్కి శిల్పంగా మార్చే శక్తి శిల్పికి ఉంటే, ఎంతటి మొద్దు విద్యార్థిని అయినా చైతన్యవంతుడిగా చేసే శక్తి ముద్దయ్యకు ఉందని నిడిగల్లు సంస్థ వాల్మీకి పీఠాధిపతి సంజయ్‌కుమార్ స్వామి అన్నారు. వెంకటేశ్వర కాలనీలోని బాపూజీ కళాశాల ప్రిన్సిపల్ ముద్దయ్యకు శనివారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1993 నుండి 2024 వరకు దాదాపు 28 సంవత్సరాల పాటు కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. బాపూజీ విద్యా సంస్థ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే ఉగ్రనరసింహప్ప మాట్లాడుతూ, ఆయన సేవలను రాబోవు తరం ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోమల, విశ్రాంత ప్రిన్సిపల్ బసవలింగప్ప, పాళేగార్ లోకేష్, రామకృష్ణ, శివన్న, గంగాధర, మాగడి రంగయ్య, విద్యార్థులు, కళాశాల సిబ్బంది కలిసి ముద్దయ్య దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం



బహుమతులు అందజేస్తున్న న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని లోక్ అదాలత్ ఛైర్మన్ సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవన్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యవివాహాలపట్ల ఎంతవరకు అవగాహన ఉందని, చట్టాలపై ఎంత అవగాహన ఉందనే విషయాలను తెలుసుకునేందుకు ఈ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాల గురించి చాలా వరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాల్లో వచ్చి ఉంటాయని వారు తెలుసుకుని ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుకునే వయసులో చదువుకోవాలని, చిన్న వయసులో పెళ్లిళ్ల చేసుకుంటే ఆరోగ్యం పాడవడమేకాక చదువు కూడా పాడవుతుందన్నారు. వీటివల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి పౌరుల్లా మెలగాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ సభ

పెనుకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండకు చెందిన రామబ్రహ్మం రాసిన 'రామా వినవేమిరా, భక్తిసుధ' పుస్తక ద్వయ ఆవిష్కరణ సభను ఆదివారం ఆర్యవైశ్య కళ్యాణమండపంలోనిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య బాల సుబ్రమణ్యం ఏలూరు వెంగన్న ఆశావాది శశాంక్ మౌళి, విన్నకోట విజయ్‌సాగర్, హాజరవుతారన్నారు. సాహితీ ప్రియులందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

భక్తులకు అయ్యప్పస్వామి కొంగుబంగారం: జడ్పీటీసీ

అగళి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భక్తులకు అయ్యప్పస్వామి కొంగు బంగారం లాంటివాడని అయ్యప్పసేవ ముక్తికి మార్గమని జెడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. అగళి మండల ం హళ్లికెర గ్రామంలోని అయ్యప్ప భక్తులకు అయ్యప్ప స్వామి విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. అయ్యప్ప భక్తులు విగ్రహం కావాలని కోరడంతో వెంటనే స్పందించి వారికి ఆ విగ్రహాన్ని అందజేశారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి భక్తులు శివప్ప రాజగోపాల్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

మేము గెలిచి ప్రయోజనమేముంది?

రొళ్ల మండలమీట్‌లో ఎంపీటీసీల ప్రశ్న

రొళ్ల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాము అడిగిన అభివృద్ధి పనులు ఏమీ జరగలేదని, ఇలా అయితే తాము గెలిచి ప్రయోజనం ఏముందని రొళ్ల మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు ఎంపీపీ కవిత వద్ద ఆవేదనవ్యక్తం చేశారు. శనివారం రొళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అందులో భాగంగా ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ, తాము చెప్పిన అభివృద్ధి పనులకు ఎవరూ సహకరించకపోతే ఎలాగని ఎంపీపీని ప్రశ్నించారు. ఇలా అయితే తాము గెలిచి ప్రయోజనం ఏముందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది అధికారులు గైర్హాజరవుతారని, అయినా వారిపై ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ అనంతరాజ్, ఎంపీడీఓ రామారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.